18 నుంచి మేడారం ప్రత్యేక బస్సులు

షురూ..

అక్షర దర్బార్, వరంగల్: తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క,సారలమ్మ జాతరకు ఆదివారం నుంచి వరంగల్ లో ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయని ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న న్యూ బస్ షెల్టర్ నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆయన వివరించారు. ప్రయాణికుల కోసం చలువ పందిళ్లు, తాగు నీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించినట్లు డీఎం తెలిపారు. ప్రత్యేకంగా నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేశామని, భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అందుబాటులో 430 బస్సులు

వరంగల్ బస్ షెల్టర్ నుంచి 430 బస్సులను భక్తులకు అందుబాటులో ఉంచినట్లు డీఎం తెలిపారు. తెలంగాణకు చెందిన మహిళలు ఒరిజినల్ ఆధార్ కార్డు కలిగి ఉంటేనే ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. వరంగల్ బస్ పాయింట్ నుంచి సుమారు రెండు లక్షల మంది భక్తులను మేడారం తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు డీఎం వివరించారు. తిరుగు ప్రయాణంలో ములుగు రోడ్డు పాయింట్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్, హనుమకొండ బస్టాండు, కాజీపేట రైల్వే స్టేషన్ వరకు ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

జాతరకు నోడల్ అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడారం జాతరకు నోడల్ అధికారులను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఐదుగురు ఐఏఎస్ అధికారులను నియమించింది. ఆర్వీ కర్ణన్, కృష్ణ ఆదిత్య, ఆదర్శ్ సురభి, ప్రతిమా సింగ్, రాధికా గుప్తాకు ప్రభుత్వం జాతర బాధ్యతలు అప్పగించింది. ఈ నెల 21 నుంచి 24 వరకు మేడారం జాతర జరుగనుంది. ఇప్పటికే జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయగా.. కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది. జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక బస్సులు కేటాయించారు. కొత్తగా హెలికాప్టర్ సేవలు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు.

భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

బాధితులకు అండగా

భరోసా కేంద్రం

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : బాధిత మహిళలు, బాలలు అధైర్య పడకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు గానూ రాష్ట్ర వ్యాప్తంగా భరోసా కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని సింగరేణి భవనంలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని శనివారం ఎస్పీ కిరణ్ ఖరే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత మహిళలకు, బాలలకు భరోసా కేంద్రం అన్ని రకాలుగా సహాయకారిగా ఉంటుందని, లైంగిక వేధింపులకు గురైన మహిళలకు, బాలలకు ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్లకు దూరంగా ఒక మంచి వాతావరణంలో వైద్యాన్ని, న్యాయ సహాయం, కౌన్సిలింగ్ వివిధ రకాలైన అన్ని సౌకర్యాలు ఒకే గొడుగు కింద అందించడం దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ.నరేష్ కుమార్, డీఎస్పీలు ఏ.సంపత్ రావు, జి.రామ్మోహన్ రెడ్డి, నారాయణ నాయక్, భరోసా కేంద్రం ఇన్చార్జీ, సీఐ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో

ఆరు వేల బస్సులు

- మహిళా భక్తులకు ఉచిత ప్రయాణం
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- మేడారంలో బస్టాండు ప్రారంభం

అక్షర దర్బార్, మేడారం: మేడారం జాతర కోసం ప్రభుత్వం ఆర్టీసీ ద్వారా ఆరు వేల బస్సులను అందుబాటులో ఉంచినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. తాడ్వాయి మండలం మేడారం జాతర కోసం ప్రత్యేకంగా అరవై ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బస్టాండు ప్రాంగణాన్ని ఆమె శనివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే మహిళా భక్తులకు

మేడారంలో బస్టాండును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మహాలక్ష్మి పథకం ద్వారా తమ ప్రభుత్వం ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీజ, సిరిశెట్టి సంకీర్త్ , ఆర్ఎం శ్రీలత, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

భూపాలపల్లి డీఎస్పీగా సంపత్ రావు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: భూపాలపల్లి డీఎస్పీగా ఏ.సంపత్ రావు బాధ్యతలను స్వీకరించారు. ఇంటెలిజెన్స్ విభాగంలో డిఎస్పీగా పనిచేస్తూ భూపాలపల్లి డీఎస్పీగా సంపత్ రావు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ రాములు హైదరాబాదుకు బదిలీ అయిన విషయం విధితమే. ఈ సందర్భంగా డీఎస్పీ సంపత్ రావును పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకంక్షలు తెలిపారు.

బైక్ అంబులెన్సులు ప్రారంభం..

మేడారం గిరిజన మ్యూజియంలో బైక్ అంబులెన్సులను మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భగా మంత్రి మాట్లాడుతూ జాతరలో ఆపద సమయంలో భక్తులకు సేవలు అందించడానికి నూతనంగా బైక్ అంబులెన్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మొత్తం 40 బైక్ అంబులెన్సుల్లో 21 రకాల వైద్య పరికరాల ద్వారా భక్తులకు వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

ఎస్సెస్సీలో మెరుగైన

ఫలితాలు సాధించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం గణపురం మండలం చెల్పూర్ జెడ్పీ హైస్కూలును ఆయన సందర్శించి పదోతరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులతో పాటు మేధోశక్తిని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఈవో రామ్ కుమార్, సెక్టోరియల్ ఆఫీసర్ కిషన్ రావు పాల్గొన్నారు.

మొలుగూరికి

పలువురి శుభాకాంక్షలు

అక్షర దర్బార్, పరకాల : కాంగ్రెస్ పార్టీలో చేరిన పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ శనివారం ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మొలుగూరి మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, సీనియర్ నాయకులు చిన్నాల గోనాదు, పట్టణ కమిటీ వర్కింగ్

భిక్షపతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రెసిడెంట్ పోరండ్ల వేణు, ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రవణ్, సురా సతీష్, ప్రధాన కార్యదర్శి చందుపట్ల రాజిరెడ్డి, సమన్వయకర్తలు కొలుగూరి రాజేశ్వరరావు, బుర్ర రాజమౌళి , రంజాన్ అలీ, శ్రీశైలం పాల్గొన్నారు.